క్లుప్తంగా

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



బుట్టలు పంపిణీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కార్వేటినగరం : పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ తులసి పేర్కొన్నారు. మంగళవారం డీఎం పురంలో సర్పంచ్ తులసి, ఎంపీటీసీ ధనశేఖర్ యాదవ్ తడి,పొడి చెత్త వేరుచేయడానికి రెండు రకాల బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కృష్ణయాదవ్, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



ట్యాంకర్‌తో నీరు అందిస్తున్న ఈవోపీఆర్డీ

కార్వేటినగరం : తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ఆర్కేవీబీపేట గ్రామానికి 'సాక్షి' దినపత్రికలో 'బోరు ఏర్పాటు చేసి తాగునీరు అందించండి' అనే కథనానికి స్పందించిన అధికారులు మంగళవారం ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ మాట్లాడుతూ.. ఎక్కడైన తాగునీటి సమస్య ఉన్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకోస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

ఘనంగా అభిషేక వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ఆశీర్వాదం

కార్వేటినగరం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని బేతేల్‌షారోన్ చర్చి పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో 21వ అభిషేక పండుగను పురస్కరించుకొని రెండవ రోజు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ.. ఏటా సంతగేటులో నిర్వహించే అభిషేక పండుగకు విశ్వాసకులు అత్యధికంగా తరలి వచ్చారని చెప్పారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రెవ. థామస్‌చాకో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఏసు ప్రజల కోసం చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కళ్యాణ్‌బాబు, మోసస్ బాలన్, బాబు పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

కాలిగ్రఫీపై శిక్షణ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఏపీసీ వెంకటరమణ

పాలసముద్రం : విద్యార్థులు అందమైన చేతిరాతలోనే భవిష్యత్తు మారుతుందని జిల్లా ఎస్ఎస్ఏ ఏపీసీ నోడల్ ఆఫీసర్ వెంకట రమణ తెలిపారు. మంగళవారం తిరుమళరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాలిగ్రఫీ, పోస్టర్ డిజైనింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మంచి చేతి రాత కలిగిన విద్యార్థి చదువు, క్రమ శిక్షణలోనూ ముందుంటారని తెలిపారు. సృజనాత్మక కార్యక్రమాల వల్ల విద్యార్థులు ప్రజ్ఞావంతులుగా మారుతారన్నారు. అనంతరం చేతి రాతలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 గిరిజ, గోపినాథ్, సుధాకర్, ఉపాధ్యాయులు మురుగదాస్, సీఆర్పీలు మునిరాజ్, శరవణన్, మహలక్ష్మి పాల్గొన్నారు

నోటీస్ బోర్డు

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలసముద్రం మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో గర్భిణులకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్ క్రిష్ణ తెలిపారు.

ఈ–పంట నమోదు చేసుకోవాలి

రైతులు ఈ–పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం, ఆముదాల, క్రిష్ణజమ్మపురం రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఉపాధి సిబ్బంది సమావేశం

మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం సిబ్బందికి సమీక్ష సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ క్రిష్ణ మహేష్‌రెడ్డి తెలిపారు. ఉపాధి పనుల జాబితా, ఎంత మంది కూలీలకు పనులు కల్పించారనే వివరాలు తీసుకురావాలని కోరారు.

– పాలసముద్రం

గ్రామం.. దుర్గంధం

- పల్లెల్లో పారిశుధ్య లోపం
- వీధుల్లో మురుగునీటి ప్రవాహం
- దోమల వృద్ధితో కుస్తీలు
- పట్టించుకోని అధికారులు



పెరుమాళ్లపల్లెలో నివాసాల పక్కనే నిల్వ ఉన్న మురుగు నీరు



కాపుమొండివెంగపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

వెదురుకుప్పం: గ్రామాల్లో మురుగు కదలనంటోంది... పేడ దిబ్బలతో పల్లెలు కమ్ముకుంటోంది... శుభ్రతకు నోచుకోని నీళ్ల ట్యాంకులు.. నివాసాల పక్కనే పేరుకుపోతున్న చెత్తాచెదారం.. ఇదీ గ్రామాల్లో ప్రస్తుతం దర్శనమిస్తున్న దృశ్యాలు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెబుతున్నా అది కేవలం ప్రచారానికే పరిమితమైంది. స్వచ్ఛాంధ్ర పేరుతో చెత్త తొలగించే కార్యక్రమాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది.

వీధుల్లోనే మురుగునీరు

ప్రకృతి ఒడిలో అలరారే పల్లెలు సైతం ప్రస్తుతం మురుగు నీరు, పేడ దిబ్బలతో కంపుకొడుతున్నాయి. గ్రామాల్లో మురుగునీటి కాలువలు నిర్మించకపోవడంతో వృథా నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. ప్రతి గ్రామంలోనూ సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువ నిర్మాణాలు చేపడతామని కూటమి నాయకులు ప్రకటించినా ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు వేయలేదు. కొత్తగా కాలువ నిర్మాణాల మాట అటుంచితే గ్రామాల్లో ఉన్న మురుగు నీటి కాలువల్లో సైతం చెత్తాచెదారంతో పేరుకుపోతున్నాయి. చేతి పంపుల వద్ద మురుగు నీరు నిల్వ ఉంటోంది. కొళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉన్నాయి. నివాసాలపక్కనే పేడదిబ్బలు దర్శనమిస్తున్నాయి. ఈ కారణంగా గ్రామాలు మురుగుతో మగ్గిపోతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ పారిశుధ్య లోపం కారణంగా గ్రామీణులు అంటువ్యాధుల బారినపడి అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మండలంలోని కాపుమొండివెంగనపల్లె, బుచ్చిరెడ్డి కండ్రిగ గ్రామాల్లో మురుగునీటి కాలువ లేకపోవడంతో వృథా నీరు వీధుల్లో ప్రవహిస్తోందని స్థానికులు అంటున్నారు. పెరుమాళ్లపల్లె ఎస్సీ కాలనీలో కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల పక్కనే గోతులు తీసి వృథా నీటిని నిల్వ ఉంచుతున్నారు. తద్వారా దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతున్నట్లు తెలిపారు. కురివికుప్పం, కొమరగుంట గ్రామాల్లో కాలువలేవు. బొమ్మన్‌దొడ్ల గ్రామంలో ఉన్న కాలువలో చెత్త పేరుకుపోయి కంపుకొడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కనికాపురం, బ్రాహ్మణపల్లె, మారేపల్లె గ్రామాల్లో సిమెంటు రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నట్లు చెబుతున్నారు. నివాసాల పక్కనే చెత్తను వేస్తుండడంతో వర్షానికి అవి కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డుపైకెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చికాపల్లం చుట్టూ చికెన్ వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది. ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితం అవుతున్నట్లు చెబుతున్నారు.

దోమలతో కుస్తీ

గ్రామాలు దోమలకు నిలయంగా మారాయి. ప్రధానంగా వెదురుకుప్పం, పచ్చికాపల్లం ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీని వల్ల అంటువ్యాధులు వ్యాపిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. కనీసం గ్రామాల్లో వారానికోసారి దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేయడం లేదని వాపోతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామస్తులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

'అవని' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పెనుమూరు (కార్వేటినగరం) : అవని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెనుమూరు డీసీసీ బ్యాంకు మేనేజర్ దిష్ను అన్నారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ డిపాజిట్‌కు 7.8 శాతం వడ్డీ ఇస్తారని చెప్పారు. అవని పథకం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా డిపాజిట్లపై 8.30 శాతం వడ్డీ సౌకర్యం ఉందన్నారు. సీనియర్ సిటిజన్ (మహిళలు)కు 8.40 శాతం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ డిపాజిట్ కాలపరిమితి 333 రోజుల మాత్రమే ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు బ్యాంకులో సంప్రదించి ఈనెల 31వ తేదీ వరకు డిపాజిట్లు చేసుకోవచ్చన్నారు.

సుశీల్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న సుశీల్

నగరి : పట్టణానికి చెందిన డి.సుశీల్ భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ నుంచి సామాజిక సేవకు గాను గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఎంఎస్ చేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉన్న సుశీల్ స్వదేశంలోని పలువురి విద్యార్థనకు, క్రీడల్లో రాణించడానికి సహకరించడంతో పాటు, అనారోగ్యం పాలైన వారికి సాయం అందిస్తూ సామాజిక సేవ చేస్తుండడాన్ని గుర్తించిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ ఆయనకు సామాజికసేవలో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగళూరులో యూనివర్సిటీ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అతి చిన్న వయసులో ఈ అవార్డు అందుకున్న యువకుడు కావడంతో పలువురు అతనికి ప్రశంసలు అందజేశారు.

హానికర ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్



బేకరీలో తనిఖీ చేస్తున్న కమిషనర్

నగరి : మున్సిపల్ పరిధిలో వాడకంలో ఉన్న హానికర ప్లాస్టిక్ వస్తువులను మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పరిధిలో మంగళవారం నిర్వహించిన తనిఖీలో భాగంగా దుకాణాల్లో వాడే హానికర ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు సుమారు 20 కిలోలు ఉంటుందన్నారు. రూ.5 వేలు మేర జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం విధించిందని ప్లాస్టిక్ విక్రయాన్ని, వినియోగాన్ని ప్రతి ఒక్కరూ మానుకోవాలని ఆయన సూచించారు. హోటళ్లు, బేకరీలలో సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. తరచూ తనిఖీ నిర్వహిస్తామని ఏవైనా లోటుపాట్లు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వార్డులోను ప్లాస్టిక్ వినియోగం, ఆహార పదార్థాల విక్రయాల నాణ్యతపై ఆరాతీసేందుకు సిబ్బంది ఉంటారన్నారు. ఈ తనిఖీలో మున్సిపల్ ఏఈ హేమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, శానిటరీ సెక్రటరీ కుమార్, పీహెచ్ మేస్త్రీ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

కార్వేటినగరం : విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం కత్తెరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ డేను జ్యోతి వెలిగించి హెచ్ఎం వాసుదేవరెడ్డితో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిచంద్రారెడ్డి, మోహన్‌మురళీ, శ్రీనివాసులు, సుజల,బాబు, భీమారావు, చలపతిరావు, రవిశేఖర్, సత్యవతి పాల్గొన్నారు.

సారా తయారీలో మహిళపై కేసు



సారా విక్రేతను అరెస్టు చూపుతున్న అధికారులు

కార్వేటినగరం : అక్రమంగా సారా తయారు చేసి , వ్యాపారులకు సరఫరా చేసిన మహిళపై కేసు నమోదు చేసినట్లు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలంలోని వేణుగోపాలపురం దళితవాడలో దాడులు నిర్వహించి బి.గోపాల్ అనే వ్యక్తి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టగా వెదురు కుప్పం మండంలోని యనమల మంద దళితవాడకు చెందిన నవనీతం వద్ద నుంచి సారా తీసుకొచ్చినట్లు గోపాల్ చెప్పడంతో నవనీతంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

17న టేకు చెట్ల వేలం

నగరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో గల 23 టేకు చెట్లకు ఈ నెల 17వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

దానధర్మాలకు ప్రతీక రంజాన్



ముస్లిం సోదరులకు చీరలు, పంచెలు వితరణ చేస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం : దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ పర్వదినమని జీడీ నెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం కార్వేటినగరంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తౌఫీర్‌ఖాన్ ఆధ్వర్యంలో కృపాలక్ష్మి చేతుల మీదుగా 500 మందికి చీరలు, పంచెలు వితరణ చేశారు. రంజాన్ మాసంలో తనకు ఉన్నంతలో పేదలకు దాన ధర్మాలు చేస్తూ తన ఉన్నతిని చాటుకుంటారని పేర్కొన్నారు. అలాంటి వారిలో సుభాఖాన్, హమీద్‌ఖాన్ ఒక్కరని ఏటా రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు చీరలు, పంచెలు వితరణ చేసి తమ దానగుణాన్ని చాటుకోవడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ అన్నారు.

సూపర్ సిక్స్ మోసం

సూపర్‌సిక్స్ పేరుతో పేదలను నమ్మించి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అటకెక్కించి, తెలుగు తమ్ముళ్లకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని కృపాలక్ష్మి ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, , స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మైనారిటీ పట్టణ అధ్యక్షుడు రఫీ, సద్దాం, ముస్తాఫ్, సబ్బీర్, హిషాద్‌ఖాన్, సుందర్‌రాజ్, వెంకటరత్నం, మురగయ్య, దేశయ్య, నందగోపాల్, మునికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినులతో ఎల్ఐసీ మహిళా నాయకులు

పుత్తూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎల్ఐసీ మహిళా ఉద్యోగులు మంగళవారం స్థానిక బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ హేమాద్రి మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అప్పుడే తల్లిదండ్రుల కలలను సాకారం చేసినట్లవుతుందని తెలిపారు. ఎల్ఐసీ యూనియన్ నాయకులు రూ.6 వేలకు పైగా విద్యా సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణకుమార్, దస్తగిరి, రమాదేవి, రాజరాజేశ్వరి, మహావాణి, మాధవి, గీత, హాస్టల్ వార్డెన్లు భాను, జయప్రద, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి యువత పోరుకు మేమంతా సిద్ధం



పుత్తూరు: యువత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న పార్టీ నేతలు



నగరి: పోస్టర్లు విడుదల చేస్తున్న పార్టీ నేతలు

పుత్తూరు: కూటమి ప్రభుత్వంలో విద్యారంగానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుకు విద్యార్థులు సిద్ధమైనట్లు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు. పుత్తూరులో సోమవారం యువత పోరు పోస్టర్లను ఆయన విడుదల చేశారు. హరి మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తోందని ఆరోపించారు. ఒక్క విద్యారంగాన్నే కాకుండా అన్ని రంగాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ నెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ యువత పోరుకు పిలుపునిచ్చిందన్నారు. ఈ మేరకు బుధవారం తిరుపతిలో నిర్వహించే యువత పోరుకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ పేరిట అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటికి పంగనామాలు పెట్టారని ఎద్దేవా చేశారు. కూటమి నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్‌మొదలి, అన్నాలోకనాథం, శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, చిరంజీవియాదవ్, జయరామిరెడ్డి, లక్ష్మణమూర్తి, బాలాజీ, బాలసుబ్రమణ్యం, శివ, మస్తాన్, మోహన్‌రెడ్డి, మునిరత్నం, చిరంజీవి, జయచంద్రన్, మునయ్య, తిరున్నావకరసు, చిన్నా పాల్గొన్నారు.

యువతపోరును జయప్రదం చేద్దాం

నగరి : యువత పోరును జయప్రదం చేద్దామని ఎంపీపీ భార్గవి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పార్టీ నేతలతో ఆమె సమావేశమయ్యారు. యువత పోరు పోస్టర్లను విడుదల చేసి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యువతకు అండగా నిలబడాలని అందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అముద, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి


విజయపురం : యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ శివరాజు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌నాయుడు, కుమార్‌రెడ్డి, శేఖర్‌రాజు, ప్రసన్న, ఎంపీటీసీ గోవిందమ్మ, జిల్లా అధికారి ప్రతినిధి చెంచురాజు, రమేష్, శ్రీరాములురెడ్డి, జిల్లు, ప్రతాప్, కన్నన్, సతీష్, దిలీప్, దేవా, సుబ్రమణ్యం, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.


వడమాలపేటలో....


వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు పత్తిపుత్తూరు వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీటీసీ ప్రతిమ, నాని, శ్రీజ, సాయి, దాము, చిన్నబ్బ పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయండి

నింద్ర: విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు తిరుపతిలో జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ దీప, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, వైస్ ఎంపీపీ శుబా, సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.







విజయపురం : పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు , వడమాలపేట: పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు , నింద్ర : యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు

నూతన పైపులు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



నూతన పంపు ఏర్పాటు చేసిన దృశ్యం

వడమాలపేట (విజయపురం): మండలం కేంద్రం సమీపం ఆదిఆంధ్రవాడలోని చేతిపంపును అధికారులు మరమ్మతు చేశారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రామ్మోహన్ పాత పైపులన్నీ తొలగించి నూతన పైపులు వేశారు. 'నూతన పైపు ఏర్పాటు చేయండి'అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి స్పందించి పైపులు ఏర్పాటు చేశారు.